ప్రజాశక్తి

సోమవారం 20 మే 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్య
ఆశయాలను ముందుకు తీసుకెళదాం..

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య పిలుపు
- ఘన నివాళులర్పించిన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళదామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య పిలుపు నిచ్చారు. స్థానిక సుందరయ్య భవనం ఆవ రణలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతని పేర్కొన్నారు. సుందరయ్య చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారని చెప్పారు. ఆనాడు పార్టీ పిలుపుమేరకు సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా మద్రాసులో జరిగిన పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మించే క్రమంలో కీలకపాత్ర వహించారని, ఏపీలోనూ సిపిఎం ఉద్యమాన్ని నిర్మించార న్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అనేక పోరాటాలు ఆంధ్ర రాష్ట్రంలో చేశా రన్నారు. పార్టీలో అంతర్గత పోరాటం చేశారని, పార్టీలో అవలక్షణాలు, మితవాద లక్షణాలకు వ్యతిరేకంగా ఆయన కృషి ▶ 2లో

దేవుడికే శఠగోపం..!

రూ.కోట్ల ఖరీదైన మాన్యం భూమి కబ్జా.!

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల వేళ ఎవరూ పట్టించుకోరను కున్నారో ఏమో తెలియదు గానీ... రూ.కోట్ల ఖరీదు గల దేవాదాయ శాఖకు చెందిన మాన్యం భూమిని ఆక్రమించాడో ఘనుడు. ఆక్రమిత భూమిలో ఏకంగా కట్టడాలు ప్రారంభించాడు. దేవాదాయ శాఖ లేదా రెవెన్యూ యంత్రాంగమూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆక్రమిత భూమి ఖరీదు రూ. 20 కోట్ల పైగా ఉంటుందని అంచనా.

ఆక్రమిత మాన్యం భూమి ఇదే

మార్కాపురం పట్టణ సమీపంలోని జాతీయ రహదారి-565 ఆనుకుని సర్వే నెంబరు 206/బిలో 3.75 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందినదిగా రికార్డుల్లో ఉంది. ఇదే భూమిని ఆలయానికి భజంత్రీయులకు సాగు కోసం ఇచ్చారు. ఇదే భూమిని గతంలో పలువురు వ్యక్తులు ఆక్రమిం చడం.. ఆ తరువాత ఆక్రమణలు ఆగిపోవడం జరిగింది. ఎన్నికల సమయంలో ఎవ్వరూ పట్టించుకోరని తాజాగా ఆక్రమణలకు దిగాడో వ్యక్తి. ఈయన ఆర్థికంగా, రాజకీయంగా బల వంతుడు. రూ.కోట్ల ఖరీదైన భూమిని ఆక్రమించి... అందులో కట్టడాలు చకచకా చేప ట్టినా ఏ ఒక్కరూ ఫిర్యాదు చేసేందుకు సైతం సాహసించలేదంటే ఆక్రమణదారుడు ఏ స్థాయి పలుకుబడి ఉన్నోడో అర్థం చేసుకోవచ్చు.

తాజాగా ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖకు చెందిన సర్వే నెంబరు 206/బిలో 3.75 ఎకరాల భూమి జాతీయ రహదారి ఆను కుని ఉంది. ఈ భూమి పట్టణ పరిధిలో ఉంది. ప్రధానంగా ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి జంక్షన్‌లో ఉంది. అక్కడే వ్యవసాయ మార్కెట్ యార్డు ఉంది. ఆ ప్రాంతం వ్యాపార సము దాయంగా మారుతోంది. అక్కడ వరకు పలు రకాల వాహనాల షోరూమ్‌లు కూడా నెలకొ ల్పారు. ఆ ప్రాంతంలో చదరపు గజం స్థలం ఖరీదు రూ.30 వేలకు పైగా ఉంది. ఎంత లేదన్నా ఎకరం భూమి ధర రూ.6 కోట్లకు పైగా ఉంది. దేవాదాయ శాఖ భూమి కూడలి లో ఉన్నందున దాని విలువ మరింత పెచ్చుగా పలుకుతుంది. ఆక్రమిత భూమి ఖరీదు తక్కు వలో తక్కువన్నా రూ.20 కోట్లకు పైగా ఉంది. ఖరీదైన భూమిని ఎలాంటి ఆధారం లేకుం డా... దేవాదాయ శాఖకు చెం దిన భూమిని ఓ వ్యక్తి అప్పనంగా కోట్టేయ డంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పట్టపగలే ఆక్రమణ చేపట్టి... ఏకంగా కట్టడాలు ప్రారం భించిన విషయం అధికారులకు తెలియనిదేమీ కాదు. ఇక్కడ అధి కారులు ఆక్రమణ అడ్డుకుం టారనే నమ్మకం కూడా లేదు. జిల్లా స్థాయి అధి కారులు జోక్యం చేసుకుంటే తప్ప ఈ ఆక్రమణ ఆగదు. దేవాదాయ శాఖకు చెందిన భూమిని కాపాడుకుంటారో... ఆక్రమణదారుడి ద్వారా దేవునికి శఠగోపం పెట్టిస్తారో చూడాలి.!

అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్
- ఒంగోలులో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాక్‌డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ చేస్తున్న పోలీసులు

సార్వత్రిక ఎన్నికలు-2024 కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో ఎక్క డైనా ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఆదివారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బందితో "మాబ్ ఆపరేషన్"మాక్ డ్రిల్స్ నిర్వహిం చడం జరిగింది. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, హింసా త్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయంలో క్రౌడ్ కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇస్తామని, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగిస్తామని, తర్వాత లాఠి చార్జ్ చేపడతామని, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా 10 ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా అన్ని సబ్ డివిజన్ల పరిధిలో ప్రత్యేక బలగాలను కూడా ఏర్పాటు చేస్తామని, పలు గ్రామాల్లో ఆర్మ్డ్ తో ఒక మొబైల్ పార్టీ తిరుగుతుంటాయని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ కిషోర్ బాబు, ఎఆర్ డిఎస్పీ చంద్ర శేఖర్, ఒంగోలు వన్ టౌన్ సీఐ అలీఖాన్, ఆర్ఐలు పాల్గొన్నారు.

హింసాత్మక చర్యలను ప్రతిబింబించేలా మాక్ డ్రిల్

కడతేరిన కూలి బతుకులు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- ముగ్గురికి గాయాలు
- కూలి పని కోసం తిరిగి వెళుతుండగా..ప్రమాదం
- నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెంలో ఘటన

బస్సులో రక్తపు మడుగులో బాధితులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఎన్నికల సందర్భంగా ఓటు కోసం సొంతూళ్లకు వచ్చి.. తిరిగి చెన్నైకి వెళుతున్న కూలీలను రోడ్డుప్రమాదం కబళించింది. కనిగిరి నుండి వెలిగండ్ల మీదుగా చెన్నై వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొంది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు వద్ద శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో వెలిగండ్లకు చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

డేవిడ్ (ఫైల్)

మరియమ్మ (ఫైల్)

వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామా నికి చెందిన వేమవరపు మరియమ్మ, (46), కంకణంపాడు గ్రామానికి చెందిన వేమవరపు డేవిడ్ (50), డేవిడ్ భార్య, విశ్రాంతమ్మ, గంధం అరుణ్, హను మంతునిపాడు మండలానికి చెందిన లాజర్ చెన్నైలో బేల్దారు పనిచేసే వాళ్లు.. ఇటీవల ఓట్ల కోసం వచ్చి.. ఓటు వేసి.. ఇంటి వద్దే ఉన్నారు. మళ్లీ పనుల కోసం చెన్నైకి శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో దామర మదుగు వద్ద ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మరియమ్మ, డేవిడ్ అక్కడికక్కడే మృతిచెందారు. డేవిడ్ భార్య విశ్రాంతమ్మ, లాజర్, అరుణ్‌కు గాయాలయ్యాయి. విశ్రాంతమ్మ పరిస్థితి విషమంగా ఉంది. డేవిడ్, విశ్రాంతమ్మకు ఇద్దరు పిల్లలున్నారు. గాయపడిన ▶ 2లో

వైపాలెంలో బెట్టింగ్‌ల జోరు

పోలింగ్ శాతం పెరగటంతో ఉత్కంఠ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో పొలిటికల్ బెట్టింగ్ జోరు ఊపందుకుంది. ఈ నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగిసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ శాతం పెరగడంతో ఓటరు నాడి అంచనా వేయడం కష్టతరంగా మారింది. అయితే పోలింగ్‌కు, ఫలితాలకు మధ్య మూడు వారాల వ్యవధి ఉండటం పందెంరాయుళ్లకు వరంలా మారింది. సాధారణ ప్రజల్లో సైతం గెలుపోటములపై చర్చ నడుస్తోంది. ఎవరు గెలుస్తారు అంటూ స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చి ప్రస్తుత పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉంటుందోనని విశ్లేషిస్తున్నారు. దీంతో యర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ కేవలం క్రికెట్ మ్యాచ్‌లకు పరిమితమైన బెట్టింగ్ కల్చర్ ఇపుడు రాజకీయాల్లోకి కూడా వచ్చింది.

పెరిగిన పోలింగ్‌పైనే ఆశలు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 2,07,214 ఓట్లు ఉన్నాయి. అందుకు గాను యర్రగొండపాలెం మండలంలో 48,704 ఓట్లు ఉండగా 43,555 ఓట్లు పోలయ్యాయి. 89.42 శాతం ఓటింగ్ జరిగింది. పుల్లలచెరువు మండలంలో 42,065 ఓట్లు ఉండగా 38,169 ఓట్లు పోలయ్యాయి. 90.73 శాతం పోలింగ్ జరిగింది. త్రిపురాంతకం మండలంలో 48,836 ఓట్లు ఉండగా 43,365 ఓట్లు పోలయ్యాయి. 88.79 శాతం ఓటింగ్ జరిగింది. పెద్దదోర్నాల మండలంలో 33,755 ఓట్లు ఉండగా 29,151 ఓట్లు పోలయ్యాయి. 86.36 శాతం ఓటింగ్ జరిగింది. పెద్దారవీడు మండలంలో 33,854 ఓట్లు ఉండగా 31,002 ఓట్లు పోలయ్యాయి. 91.57 శాతం పోలింగ్ జరిగింది. దీంతో పెరిగిన పోలింగ్‌పై ఇరు పార్టీల నేతలు తమకు అనుకూలం అంటే తమకు అనుకూలం అంటూ ఆశలు పెట్టుకున్నారు. అంచనాలకు వస్తున్నారు. బెట్టింగ్‌లు కడుతున్నారు.

రెండు పార్టీలపై జోరుగా పందేలు..

టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు 10 వేల మెజార్టీతో గెలుస్తారని కొందరు పందెం కాస్తుండగా, వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ గెలుస్తారని మరికొందరు పందెం కాస్తున్నారు. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకూ జరుగుతున్న ఈ బెట్టింగ్ ఒకటికి నాలుగు వంతులు చొప్పున నడుస్తున్నట్లు తెలుస్తోంది. నువ్వా.. నేనా అన్నట్టు పోటీ నెలకొంది. ఫలితాలపై జనాలకు ఉన్న ఆసక్తికి, తమ పార్టీల గెలుపుపై యువకులకు ఉన్న విశ్వాసానికి ఈ పందేలు నిదర్శనంగా మారాయి. కొంతమంది భూములను, మరికొంత మంది రూ.లక్షల్లో పందేలు కడుతున్నారు.

క్రికెట్ నుంచి పాలిటిక్స్‌కు..

బెట్టింగుల జోరు క్రికెట్ నుంచి పాలిటిక్స్‌కు విస్తరించింది. క్రికెట్‌లో ఎవరు టాస్ గెలుస్తారో నుంచి ఏ బాల్‌కు సిక్స్ ఫోర్ కొడతారో అనే అంశాలపై బెట్టింగ్ కాస్తారు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి మొదలై ఇప్పటి వరకూ అభ్యర్థుల గెలుపోటములు, వారికి వచ్చే మెజారిటీ ఓట్లపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. పోలింగ్ రోజున కేంద్రాల నుంచి ఓటు హక్కు వినియోగించుకుని బయటకు వారితో మాట్లాడి నాడి తెలుసుకునే ప్రయత్నాలు చేశారు. మహిళలు, వృద్ధులు, యువత నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నారు. ప్రధానంగా గెలుపోటములు ప్రభావితం చేసే సామాజికవర్గాల వారీగా ఎవరు ఏ పార్టీకి మొగ్గు చూపారనేది అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల గణాంకాలు పోలింగ్ శాతం, 2024లో నమోదైన పోలింగ్ శాతంతో పోల్చి అంచనాలు వేస్తున్నారు. ఏమైనా ఇప్పటి దాకా వైసీపీకి కంచుకోటగా ఉన్న వైపాలెం నియోజకవర్గంలో ఇరు పార్టీలు పోటీలు పడి బెట్టింగ్‌లు కాయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళదాం..

(మొదటిపేజీ తరువాయి)

చేశారన్నారు. 1952లో ఎన్నికల తర్వాత సుందరయ్య రాజ్యసభకు ఎంపికై ప్రతిపక్ష నేతగా ఉన్నారన్నారు. ప్రతిపక్ష నేతగా పార్లమెంట్‌లో అందరికీ ఆదర్శంగా ఉండే వారని తెలిపారు. ఆయన సైకిల్‌పైనే పార్లమెంట్ కి వచ్చేవారని, ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడే వారన్నారు. 1956లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో సిపిఎం ఉద్యమ నిర్మాణానికి విశేషంగా కషి చేశారన్నారు. అనేక వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారని తెలిపారు. సుందయ్య ఉద్యమ స్ఫూర్తితో సిపిఎం ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ సుందరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర వహించారన్నారు. దేశంలో సిపిఎం నిర్మాణానికి విశేషంగా కషి చేశారన్నారు. అన్ని తరగతుల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కావాలంటే పోరాటాలు, ఉద్యమాలు విస్తతంగా చేయడమే మార్గమన్నారు. సుందరయ్య ఉద్యమస్ఫూర్తితో జిల్లాలో పార్టీని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి.తిరుపతిరావు, బి.రఘురామ్, పి.కల్పన, కె.రమాదేవి, నగర కార్యదర్శి జి.రమేష్, తంబి శ్రీను, దామా శ్రీనివాసరావు, మహేష్, హుస్సేన్, ప్రజాసంఘాల నాయకులు షెమ్మి, ఎంఎల్వి ప్రసాదరావు, కె.బాబు, వినోద్, జి నర్సయ్య, యస్.నరసింహారావు, బి.వెంకట్రావు, జ్యోతి, సువర్ణరాజు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కడతేరిన కూలి బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

వారిని చికిత్స నిమిత్తం ముందుగా నెల్లూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా.. మరింత మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విశ్రాంతమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలినేనిని కలిసిన వైసిపి సిఎస్ పురం మండల నాయకులు

బాలినేనిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

వైసిపి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని వైసిపి మండల నాయకులు హైదరాబాదులో ఆయన నివాస గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని పోలింగ్ సరళి, దద్దాల నారాయణ యాదవ్ గెలుపు గురించి బాలినేనితో సమీక్షించినట్లు తెలిసింది. బాలినేనిని కలిసిన వారిలో వైసిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైఎ ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, నాయకుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, చోడ రవిచంద్రరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, బసివి చంద్రశేఖర్ ఉన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా..

నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శివం నిత్య అన్నదాన వాహనం ద్వారా ఒంగోలు నగరంలో పేదలు 300 మందికి పౌష్టిక ఆహారంతో కూడిన భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి తన నిరాడంబరతను చాటిన నిజాయతీపరుడు సుందరయ్య నేటి యువతకు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి టి భక్తసింగ్‌రాజు, డాక్టర్ మొగిలిదేవా పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న కమిటీ నాయకులు

గొడుగులపాలెంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-కొండపి: స్థానిక బీసీ కాలనీ, గొడుగులపాలెంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కొండపి సిఐ వై పాండురంగారావు తెలిపారు. వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా పరిశీలించాలన్నారు. కొండపి ఎస్ఐ కృష్ణబాజి, పొన్నలూరు ఎస్ఐ రాజేష్, మర్రిపూడి ఎస్ఐ శివబసవరాజు పాల్గొన్నారు.

I MOTUPALLI UMA MAHESWARA RAO S/o CHANDRAIAH Aged 48 years, R/o LBS Nagar, Chirala have changed my name from MOTUPALLI MAHESH (old name) to MOTUPALLI UMA MAHESWARA RAO (changed name) having DOB 15.08.1975 for all future purposes vide Affidavit No IN-AP86286466 569758W dated 14.05.2024.

జూన్‌లో కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్ పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన టిటిడి కల్యాణ మండపాన్ని జూన్‌లో ప్రారంభించనున్నట్లు కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి తెలిపారు. గ్రామ పెద్దలతో టిటిడి కల్యాణ మండపం ప్రాంగణం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. కల్యాణ మండలం నిర్మాణం పూర్తయి చాలాకాలం గడిచినప్పటికీ నేటికీ ప్రారంభానికి నోచలేదన్నారు. ఈ నేపథ్యంలో చిన్నచిన్న పనులు పూర్తి చేసి జూన్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గోను చంద్రశేఖరరెడ్డి, పాలపర్తి నారాయణరావు, అంకయ్య, ఏలికా నాగేశ్వరావు, బలభద్ర జాన్ పాల్గొన్నారు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
క్రిమినల్ ప్రొసీజరు కోడ్ 82 వ సెక్షన్ ప్రకారం నిందితునికి కోర్టు వారి బహిరంగ ప్రకటన

ఒంగోలు పట్టణం పత్తి వారి బజారు ఇంటి నెంబర్18-1-20, తిరుమల ఎలక్ట్రానిక్స్ ఎదురుగా నివసిస్తున్న 53 సంవత్సరాల వేమూరి రాజేష్ తండ్రి లేటు రంగనాయకులు అనబడే నీపై ఒంగోలు పట్టణం గొడుగు పాలెం నివాసి యల్లంరాజు చెంచు సుబ్బారావు గారి కుమారుడైన సుందర రావు అనే వ్యక్తి కి బాకీ చెల్లింపుకై చెల్లని చెక్కులు ఇచ్చి నేరం చేశావని అందుకు శిక్ష విధించాలని కోరుతూ నెగోషియల్ ఇన్ స్ట్రుమెంట్ చట్టం సెక్షన్138 కింద CC నెంబర్ 440/2016 న ఒంగోలు మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసు దాఖలు చేసినారు గత కొన్ని సంవత్సరాలుగా నీపై కోర్టు వారు ఇచ్చిన నాన్ బేయిలబుల్ అరెస్టు వారెంట్ పెండింగ్ లో ఉన్నది

సదరు అరెస్టు వారంటు అమలు కానీయకుండా ఉండేందుకు నీవు పోలీసులకు, అడ్వకేట్ కమిషనర్, గారికి దొరకకుండా తప్పించు కుని తిరుగుతున్నావు కావున ఈ ప్రొక్లమేషన్ ద్వారా పైన చెప్పబడిన వేమూరి రాజేష్ తండ్రి లేటు రంగనాయకులు అను నీవు 22-05-2024 వ తేదీన ఉదయం 10.30 నిమిషాలకు శ్రీయుత కోర్టు వారి ముందు స్వయంగా హాజరై కంప్లయినంట్‌కు సమాధానం చెప్పవలసిందిగా ఉత్తర్వును జారీ చేయడమైనది

ఒంగోలు
తేది : 19-05-2024

ఇట్లు
శ్రీయుత మొబైల్ మెజిస్ట్రేట్ వారి కోర్టు,ఒంగోలు.

గ్రంథాలయంలో చిన్నారుల సందడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7 వరకు జరిగే వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. పాటలు పాడించారు. ఉపాధ్యాయులు దాసరి లక్ష్మీప్రసాద్ తెలుగు భాషలో గుణింతాలు రాయించటం, పుల్లలతో వస్తువులు ఎలా తయారు చేయాలో, తెలుగు వ్యాకరణంలో అక్షరాలు గుర్తించటం నేర్పించారు. సిహెచ్ సుధాకరరావు పుస్తక సమీక్ష గురించి పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయులు, కవి జాలాది మోహన్ పిల్లలకు నీతి కథలు చెప్పటం, పిల్లలతో కథలు చెప్పించడం, మ్యాథ్స్ పజిల్స్ నేర్పించారు. ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రోత్సహించి వేసవి విజ్ఞాన శిబిరానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె సంపూర్ణమ్మ, డి సందీప్, పి ఇమ్మానుయేలు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి పేరయ్య, నున్నా ఆంజనేయులు, 36 మంది చిన్నారులు పాల్గొన్నారు.

ఆటపాటల్లో చిన్నారులు

పడకేసిన పారిశుద్ధ్యం

- రోడ్లపై మురుగునీరు
- రాకపోకలకు అవస్థలు
- పందులతో పొంచి ఉన్న ముప్పు

రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు శివనగర్ కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. సైడు కాలువల్లో చెత్త, చెదారం పేరుకు పోయింది. దీంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. ఫలితంగా దుర్గంధం వెదజల్లుతోంది. మురుగుకాలువలు దోమలకు ఆవాసం కేంద్రంగా మారాయి. అనేక సంవత్సరాల క్రితం నిర్మించిన మురుగు కాలవలు శిథిలావస్తకు చేరాయి. పూడికతో నిండిపోయింది. దీంతో నీరంతా రోడ్లపైనే పారుతోంది. రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన చప్టాలు సైతం కృంగి పోయాయి. దీంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగునీటిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. మురుగునీటిలో పందులు ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నాయి. మురుగునీటిలో దోమలు వ్యాప్తి చెందాయి. దోమల కారణంగా రాత్రి వేళ కంటి మీద కునుకే ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. పందులు, దోమల కారణంగా ఎక్కడ వ్యాధుల బారిన పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సమస్యను గతంలో పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా దెబ్బతిన్న చట్టాలు, సైడ్ కాలువలకు మరమ్మతులు చేపట్టి సమస్యల నుంచి తమను గట్టెక్కించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఈదుమూడి గ్రామంలో ఆరోగ్యసిరి కార్యక్రమంలో భాగంగా మనం- మనఊరు- మన- ఈదుమూడి స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ వెంకటేష్ , డాక్టర్ సరయు,డాక్టర్ పల్లవి ఆధ్వర్యంలో 140 మందికి కంటి ,పళ్ళు, ఇజిసి, బిపి ,షుగర్ గుండె తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

43 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 43 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కష్ణ మోహన్, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ళ చెంచయ్య, వీరమోసు మస్తానరావు, మానికొండ వెంకటేశ్వర్లు, గుంటుపల్లి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

కొండపి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొండపి శాఖ గ్రంథాలయం విద్యార్థుల చేత ఆదివారం పుస్తక పఠనం చేయించినట్లు గ్రంథపాలకుడు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల విద్యార్థులు విజ్ఞాన వంతులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి : వేసవిల విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకురాలు వి.విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రమణయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -శింగరాయకొండ

టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991-1996 విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు చదువు చెప్పిన కొండలరావు మస్తారును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో రైస్ పుల్లింగ్ ముఠా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గుడి ముందు అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు,గ్రామస్తుల కథనం ప్రకారం... నాగరాజుపల్లి గ్రామంలోని లక్ష్మి నారాయణ స్వామి ఆలయంలోకి సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చిపోతున్నారు. ఫొటోలు,వీడియోలు తీసున్నారు. అక్కడ పరిస్థితులను డ్రోన్ కెమెరా ద్వారా రికార్డు చేస్తున్నారు. గ్రామస్తులు ఈ విషయాన్ని గుర్తించి గుడి వద్దకు వస్తున్న అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో తెలంగాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న మారుతి డిజైర్ కారు, యునికార్న్ బైక్ పై ఐదుగురు వ్యక్తులు ఆదివారం వచ్చారు. గుడిలోపలికి వెళ్లి ధ్వజస్తంభాన్ని తమ సెల్ ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు వారిని మీరు ఎవరంటూ ప్రశ్నించారు. దీంతో వారు పురాతన ఆలయాలను సందర్శించడానికి వచ్చామని, రాజుపాలెం వెళ్లడానికి దారి తప్పి నాగరాజుపల్లి వచ్చామని పొంతన లేకుండా సమాధానం చెప్పారు. గ్రామస్తులను మాటల్లో పెట్టి అక్కడి నుంచి కారులో పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో గ్రామానికి చెందిన దాసం అంజయ్య, జడ కోటయ్య, జడ కొండలు, తాత ఆదెయ్య, నిస్సంగి హనుమంతరావు మరి కొందరు గ్రామస్తులు బైకులపై వారిని వెంటాడారు. కోణిదెన సమీపంలో వారిని అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎఎస్ఐ శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకొని ఐదుగురు వ్యక్తులను మార్టూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. నిందితులు పురాతన దేవాలయాల్లోని ధ్వజస్తంభానికి ఏర్పాటు చేసిన కలశాలకు అద్వితీయ శక్తులు ఉన్నాయని చెప్పి అమాయక ప్రజలను మోసగించి విక్రయించే రైస్ పుల్లింగ్ ముఠాగా అనుమానిస్తున్నారు.

గ్రామస్తులకు పట్టుబడిన నిందితులు

శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాలతో ఆదివారం నిర్వహించారు. కృష్ణసాయి పాలిష్ యూనిట్-3 లో శిద్దా వెంకటేశ్వరరావు కార్మికులు,ఉద్యోగులు మధ్య భారీ కేక్ కట్ చేశారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కృష్ణసాయి ప్రతినిధి శిద్దా భరత్ మాట్లాడుతూ గనిలో ఉత్పత్తితోపాటు కార్మికుల భద్రత,సంక్షేమం రెండూ ముఖ్యమన్నారు.ఆరోగ్యం విషయంలో కార్మికులు జాగ్రత వహించాలన్నారు. ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి ఎమ్‌డి ప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శిద్దా వెంకటేశ్వరరావు,శిద్దాభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు.ఒంగోలు ఉపాస ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా ఒంగోలు కర్నూలు రోడ్డుపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు బోనస్ అందజేశారు. భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, జనరల్ మేనేజర్ మురళీమోహనరావు, మేనేజర్లు కమలాకర్, శ్రీనివాసులరెడ్డి, ఆంజనేయులు, కిషోర్ కుమార్, శ్రీనివాస్,ఉపాస ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్, సువర్ణరాజు, రామసుబ్బారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శిద్దా వెంకటేశ్వరరావు

వృద్ధురాలు దారుణ హత్య

ప్రజాశక్తి- కొత్తపట్నం

హత్యకు గురైన నాగేశ్వరమ్మ

గుర్తుతెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలును దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ బి. సాంబశివరావు కథనం ప్రకారం... రెడ్డిపాలెంకు చెందిన గుడిపల్లి నాగేశ్వరమ్మ (75) అనే వృద్ధురాలు కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. రోజులాగే కల్లుగీత కార్మికుడు ఉదయాన్నే నాగేశ్వరమ్మ ఇంటికి కల్లు తీసుకొచ్చాడు. ఆమె మంచంపై పడుకొని ఉంది. ఎంత పిలిచినా పలుకలేదు. అనుమానం వచ్చి కల్లుగీత కార్మికుడు నాగేశ్వరమ్మ దగ్గరకు వెళ్లి పరిశీలించాడు. ఆమె చనిపోయి ఉంటాన్ని గుర్తించి కుమారుడికి ప్రకాష్ రావుకు సమాచారం అందించారు, నాగేశ్వరరమ్మ కుమారుడు ఇంటికి వద్దకు వచ్చి పరిశీలించారు. ఇంటిలోని వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. నాగేశ్వరమ్మ మెడ, ముక్కుపై గాయాలు ఉంటాన్ని గుర్తించాడు. నాగేశ్వరమ్మ హత్యకు గురైనట్లు బావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని వివరాలను సేకరించారు. డాగ్ స్క్వాడ్ ను రంగంలో దించి వివరాలు సేకరించారు. అర్ధరాత్రిరెండు గంటల సమయంలో నాగేశ్వరమ్మ హత్యకు గురైనట్లు పోలీసులు బావిస్తున్నారు. కేసును అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబశివరావు తెలియజేశారు. డిఎస్పీ కిషోర్ కుమార్, క్రైమ్ అడిషనల్ ఎస్ఐ శ్రీధర్ రావు, సిఐ జగదీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


మృతిచెందిన విష్ణునారాయణ

ఆటోను ఢీకొన్న కారు ..

- ఒకరు మృతి
- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -కనిగిరి

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది.అందిన వివరాల ప్రకారం... ఒంగోలు నుంచి కనిగిరి వైపు వస్తున్న కారు కనిగిరి నుంచి కాశిరెడ్డి కాలనీకి వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దేవాంగనగర్‌కు చెందిన బి.విష్ణు నారాయణ (57) అక్కడికక్కడే మృతిచెందాడు. జి. గురవమ్మ, ఎ. కస్తూరి, రామకష్ణ అనే వారు గాయపడ్డారు. క్షత గాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వే స్టేషన్ పరిధిలోని ఊళ్ల పాలెం రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం మూడో రైల్వే ట్రాక్‌పై పడి ఉంది. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న సిహెచ్ మజుందార్

సుందరయ్య వర్ధంతి సందర్భంగా

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానికంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో 8వ రోజు సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ ప్రారంభించారు. తోకల హరిబాబు జ్ఞాపకార్థం వైసీపీ సీనియర్ నాయకులు దేవరపల్లి ఉపసర్పంచి తోకల కృష్ణమోహన్, కుటుంబ సభ్యుల, రోటరీ క్లబ్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి పేతురు, బి చినదాసు, ఎం డేవిడ్, ఎం సుబ్బారావు, సిఐటియు నాయకులు రాజశేఖర్, కె శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కందిమళ్ళ రామకోటేశ్వరరావు

గంగవరంలో వైద్యశిబిరం..

132 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని గంగవరం గ్రామంలోని గంగవరం ప్రాంత ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 15 గ్రామాల నుండి ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 132మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన శిబిరానికి హాజరైన వారికి బిపి, షుగరు, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. రు.200లకే రెండు నెలలకు సరిపడా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ అన్నంరాజు సాంబయ్య, డాక్టర్ ఈశ్వరరావు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, మంచాల అనంతలక్ష్మి స్మారకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో వేదిక కన్వీనర్ కరి బాలచందర్, రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, ఎవి సుబ్బరావు, జ్యోతి ఏసుబాబు, శృతి, నాగండ్ల వెంకట్రావు, టివి సుబ్బారావు, జయరాం, తలపనేని రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.10 లక్షల ఆదాయం

డిపో మేనేజర్ సుందరరావు

ప్రజాశక్తి - పొదిలి

మూడు రోజుల క్రితం కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా పొదిలి నుండి ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.10లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ సుందరరావు తెలిపారు. 30 బస్సులను 51ట్రిప్పులతో రెండు రోజులపాటు ఉత్సవాలకు నడిపినట్లు తెలిపారు. రూ.10,18,288 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. తిరునాళ్ళు, ఉత్సవాల సందర్భంగా భక్తులకు ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా సంస్థకు అత్యధిక ఆదాయం వచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రత్యేక సేవలు కొనసాగిస్తామని తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సుందరయ్య

సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి - పంగులూరు

పీడిత ప్రజల ఆశాజ్యోతి, దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగారావు మాట్లాడుతూ చిన్నతనం నుండి అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, పాలపర్తి ఏలియా, పి ఆదుమ్ సాహెబ్, తలపనేని సుబ్బారావు, దేవరకొండ రాముడు, తానికొండ సుధాకర్, తలపనేని శంకర్రావు, నాగబోయిన రామంజమ్మ, తలపనేని సుకన్య పాల్గొన్నారు.

సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న వై సిద్దయ్య

ఇంకొల్లు రూరల్ : సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య కోరారు. మండలంలోని గంగవరంలోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో జరిగిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి వివాళి అర్పించారు. సుందరయ్య సేవలను స్మరించుకున్నారు. వర్ధంతి సభలో మాదల అంజయ్య, కందిమళ్ళ రామకోటేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ నాగండ్ల వెంకట్రావు, ఎవి సుబ్బారావు, ఎషయ్య, యర్రం గోవిందరెడ్డి, డాక్టర్ మంచాల రమేష్, భానుప్రసాద్, భవనం శ్రీనివాసరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భట్టిప్రోలు : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సత్య నారాయణ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని సూచించారు. సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్, మావయ్య, సిపిఎం నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, దీపాల సత్యనారాయణ, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమూరు : అమర్తలూరు, వేమూరు మండలాల్లో సిపిఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్ర పటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, అమర్తలూరు, వేమూరు మండలాల సిపిఎం కార్యదర్శి బొనిగల ఆగస్టిన్ పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్, తాతయ్య, సంసోను పాల్గొన్నారు.

వేమూరులో సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పొదిలిలో సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నేతలు

పొదిలి : సుందరయ్య జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకొని ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు ఎం రమేష్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రమేష్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య నేటి తరానికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి కోటేశ్వరరావు, కెవి నరసింహం, డి సుబ్బయ్య, పి నాగేంద్రం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపల్లెలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

రేపల్లె : సీపీఎం అగ్రనేత, దక్షణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పుట్టగుంట ఆదినారాయణ కుటుంబ సభ్యులు సౌజన్యంతో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో సుందరయ్య వంటి ఆదర్శ నేతలు కరువయ్యారని అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో సిపిఎం పేదల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నేతలు కెవి లక్ష్మణరావు, జె ధర్మరాజు, ఆగస్టిన్, ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దంకిలో సుందరయ్య చిత్రపటానికి నివాళి దృశ్యం

అద్దంకి : స్థానిక సుందరయ్య భవన్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం నాయకులు పి తిరుపతిరెడ్డి, పనకా రామాంజనేయులు, డాక్టర్ ఎలగాల హనుమంతరావు మాట్లాడారు. కామ్రేడ్ సుందరయ్య జీవిత విశేషాలు వివరించారు. జి వెంకట్రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతవరంలో నివాళి అర్పిస్తున్న బొనిగల సుబ్బారావు

మేదరమెట్లలో సుందరయ్య చిత్రపటానికి నివాళి

మేదరమెట్ల : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్టీ కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి ఎం ఆంజనేయులు మాట్లాడారు. సుందరయ్య జీవితం కమ్యునిస్టు ఉద్యమ చరిత్రలో భాగమని అన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి వైకుంఠం, జయమ్మ, అన్నపూర్ణ, బాబురావు పాల్గొన్నారు.

మార్టూరులో సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

మార్టూరు రూరల్ : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు, లక్ష్యాలను కొనసాగించాలని సిపిఎం జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, ప్రభుదాసు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

తోకలవారిపాలెంలో కామ్రేడ్ సుందరయ్యకు నివాళి

కొల్లూరు : మండలంలోని తోకలవానిపాలెంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు, సర్పంచ్ టి కృష్ణమోహన్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వాగోలు యేసు, కంచర్ల రామారావు, కె పిచ్చయ్య, కె మారయ్య, నలిగిల కోటేశ్వరావు, వాగోలు పసి, ఎం నాగేశ్వరావు, లంకపల్లి పోతురాజు పాల్గొన్నారు. మండలంలోని అనంతవరంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, కనపర్తి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. గోళ్ళ పెద్ద శ్రీరాములు సిపిఎం జెండా ఆవిష్కరించారు. ఉన్నం రమణ, బొనిగల ప్రసాద్, గద్దె పిచ్చయ్య, మేడికొండ జ్యోతిబాస్, మంచాల మార్క్, కనపర్తి సునీల్, గొల్ల కోటయ్య, గోళ్ళ శుభశేఖర్ పాల్గొన్నారు.

పర్చూరు : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక బొమ్మల సెంటర్లో సిపిఎం సీనియర్ నాయకులు టీ పేతురు సిపిఎం జెండా ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందారు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య మాట్లాడుతూ నిస్వార్ధ నేత సుందరయ్య నిజాయితీకి మారుపేరని అన్నారు.

పర్చూరులో నివాళి అర్పిస్తున్న సిహెచ్ మజుందార్

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఒంగోలు నగరంలో 30 సెంటర్లలో సిపిఎం జెండాలను ఎగరవేశారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దిబ్బల రోడ్, బైపాస్ రోడ్డు, గాంధీనగర్ సెంటర్ భగత్ సింగ్ కాలనీ బండ్లమిట్ట సెంటర్, కొప్పోలు, త్రోవగుంట , ఎఫ్‌సిఐ సెంటర్‌లో సిపిఎం జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరయ్య దోపిడీకి వ్యతిరేకంగా వీర తెలంగాణ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. ప్రజలకు రూపాయికే గన్నవరం నియోజకవర్గంలో బియ్యం పంపిణీ చేశారని తెలిపారు. నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు అందించారన్నారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకం ద్వారా అభివద్ధిని వివరించారన్నారు. బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పోరాడినట్లు తెలిపారు. సుందరయ్య ఆదర్శాలను పాటించాలని నిబద్ధలతో కషి కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు ఎస్‌డి.హుస్సేన్ టి.మహేష్, దారా వెంకటేశ్వర్లు, కొర్నెపాటి శ్రీనివాసరావు, కె.శ్యామ్, ఎమ్‌డి యాసిన్, ఎస్‌కె.హరికష్ణ, పార్టీ సీనియర్ నాయకులు ఎన్.రంగారావు, ఎవి.పుల్లారావు, జి.ఆదిలక్ష్మి, జి.రాజ్యలక్ష్మి, బి.ముసలారెడ్డి, జి.భీష్మాచారి, ఎం. శ్రీనివాసులు, ఎస్‌కె. పీరుసాహెబ్, ఎస్.హనుమంతరావు, బి. పేతురు, పి.నరసింహారావు, బి.భావనారాయణ, ఎం. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో నివాళులర్పిస్తునర్న నాయకులు

కొప్పోలులో..

ఒంగోలు నరగ పరిధిలోని కొప్పోలు గ్రామంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కనుబద్ది కృష్ణారెడ్డి మాస్టారు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్యరంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొప్పోలు శాఖ కార్యదర్శి ఎస్. హనుమంతరావు, సీనియర్ నాయకులు బొడపాటి రాఘవరావు, సిపిఎం జిల్లా నాయకులు పెండ్యాల హనుమంతరావు, సిపిఎం శాఖ సభ్యులు ఆవులమంద వెంకటయ్య, మధిర ఆదినారాయణ, ఆవులమంద ఆంజనేయులు, గంగాడి నాగేశ్వరరావు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలం కెవిపాలెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి : కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శ ప్రాయమని సిపిఎం దర్శి నియోజక వర్గ కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు సందు వెంకటేశ్వరరావు సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, మహిళా సంఘం నాయకులు ఉప్పునారాయణ, నాగేశ్వరరావు, జాన్ సామ్యేల్, ఆదినారాయణ, లక్ష్మీ, పద్మావతి, రంగమ్మ, రమణ, మోహానరావు, రంగనాయకులు, అంజిబాబు పాల్గొన్నారు.-

పెద్దారవీడు : మండల పరిధిలోని సానికవరం గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో పుచ్చలపల్లి సుందరయ్య విశేష కృషి చేసినట్లు తెలిపారు. తన చివరి శ్వాస వరకూ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసినట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపిదేశి మల్లయ్య, దొడ్డా సుబ్బారెడ్డి, గుంటక యోగిరెడ్డి, గుంటక సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు మండలం సానికవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

శింగరాయకొండ : పుచ్చలపల్లి సుందరయ్య, దాచురి రామిరెడ్డిని నేటి తరం ప్రజలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. హరిబాబు తెలిపారు. స్థానిక దాచూరి రామిరెడ్డి అనసూర్యమ్మ సిఐటియు యుటిఎఫ్ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య, దాచురి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య దాచూరి రామిరెడ్డి చిత్రపటాలకు పూలమాలు వేసే నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. మొట్టమొదటిసారిగా వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసి రైతు కూలీలకు అండగా నిలిచినట్లు తెలిపారు. తమ చివరి క్షణం వరకూ ఉద్యమాలే ఊపిరిగా ప్రజా సమస్యల ఎజెండాగా ఇద్దరు నాయకులు నిలిచారన్నారు.ఈ కార్యక్రమంల యుటిఎఫ్ జిల్లా నాయకులు జె. కేశవరాజు, సిఐటియు నాయకులు టంగుటూరి రాము, ప్రేముల బాబూరావు, వార్డు సభ్యులు పడిదపు రవికుమార్, టి. రామ్మూర్తి , కొల్లూరి వెంకయ్య, కోటపాటి నారాయణ, ఎం. నరసింహారావు , బుర్ల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లిలో..

జరుగుమల్లి మండలం చింతలపాలెంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాను ఎగుర వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తన్నీరు సుబ్బారావు,ప సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు, మండల నాయకులు వి.మోజెస్, బెజవాడ శివయ్య, కెవి.శేషయ్య, జి.అంకయ్య, గడ్డం సాల్మన్, మాధవ, డి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు

పొందూరులో...

టంగుటూరు మండలంలోని పొందూరు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పంది బాలకోటయ్య ఎర్ర జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టంగుటూరు మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, సిపిఎం పొందూరు గ్రామ కార్యదర్శి వేజండ్ల సింగయ్య, పి.వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్, పి.ఏసుదాస్, సుధాకర్, సాగర్, నాగరాజు, పిచ్చిబాబు పాల్గొన్నారు.

కొండపి : మండల పరిధిలోని కొండపి, పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్, కోటిరెడ్డి శివరామయ్య, సాయమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి : స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనతరం సిపిఎం జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు. మండల కమిటీ సభ్యులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి,పులి ఓబులరెడ్డి సిహెచ్. కొండయ్య ,కె. శ్రీనివాసులరెడ్డి, కనకరాజు,బి. ఆంజనేయులు, పి. ఏడుకొండలు,. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కెవిపాలెంలో..

కెవిపాలెంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. కెవిపాలెం-చీమకుర్తి రోడ్డు మలుపుల వద్ద ప్రమాదభరితంగా మారిన కంకర రాళ్ళను తొలగించి శ్రమదానం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిపిఎం గ్రామ కమిటీ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, రావూరి వెంకటరావు, పమిడి రామారావు, పమిడి సుబ్బారావు, కొల్లూరి అక్కయ్య, నల్లూరికృష్ణయ్య, కొల్లూరి వెంకటేశ్వర్లు, పొత్తూరిసురేష్, బసవయ్య పాల్గొన్నారు.

పామూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు : ప్రజా సమస్యలపై నిరంతరం కషి చేయటమే సుందరయ్యకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా నాయకులు కాలం సుబ్బారావు తెలిపారు. మద్దిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కనపర్తి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కాలం సుబ్బారావు మాట్లాడుతూ సుందరయ్య సమస్యలు అధ్యయనం చేసి మాట్లాడేవారనీ, నిరాడంబరంగా జీవించారని నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం జీవితం గడిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, కాశీం, శ్రీను, కాకుమాను సుబ్బారావు, వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, నాగేంద్రమ్మ, విక్రమ్, శ్రీనాథ్ పాల్గొన్నారు

కనిగిరి : కనిగిరి పట్టణ సిపిఎం కార్యదర్శి పిసి.కేశవరావు, మండల పరిధిలోని చాకిరాలలో సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు నిర్వహించారు. తొలుతు సిపిఎం జెండాను ఎగురవేశారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాలకొండయ్య, ఏడుకొండలు, కాశయ్య, వెంకటరెడ్డి,ఎస్‌కె.బషీరా, రమణమ్మ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఉప్పుగుండూరులో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సిపిఎం జిల్లానాయకుడు జె.జయంతి బాబు మాట్లాడూతూ సుందరయ్య నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నేతగా ఎదిగారన్నారు. అనేక ఇబ్బందులు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ , జి. బసవపున్నయ్య, యు.వెంకటేశ్వర్లు, కె. సుబ్బారావు ,కోటేశ్వ రావు, రావెళ్ళ వెంకట్రావు, యు. శ్రీను, రామాంజనేయులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

వెలిగండ్ల : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి మండల పరిధిలోని రామలింగాపురం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి జిల్లా జన విజ్ఞాన వేదిక నాయకులు ఒంటిపెంట మాలకొండ రెడ్డి పూలమాలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కనిగిరి మాంటిసోరీ హైస్కూల్ కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, సిపిఎం వెలిగండ్ల శాఖ కార్యదర్శి రాయల మాలకొండయ్య, సిపిఎం రామలింగాపురం శాఖ కార్యదర్శి రాయల రమాదేవి, జివిఎస్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కండే బాలకష్ణ, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకుడు జుటికే సురేష్, వివిధ కార్మిక సంఘం నాయకులు కాకర్ల ధనలక్ష్మి, కాకర్ల నాగేశ్వరి, కార్తీక్ ,నారాయణ, మోహన వంశీ, రాచకొండ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పామూరు : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు యువతకు ఆదర్శం కావాలని సిపిఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి అన్నారు. సుందరయ్య వర్ధంతి సభ ఎస్‌కె.గౌస్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులు సింహాద్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.శంకర్, మదారమ్మ, చల్లా వెంకటేశ్వర్లు, రబ్బాని, వీరాంజి, ఎ.రామయ్య, బి.నాగేశ్వరావు, శివరామయ్య ,కాలేషా, సుభాని, మాధవ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా హనుమంతుని పాడు, సీతారామపురం గ్రామాల్లో సిపిఎం జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, బడుగు వెంకటేశ్వర్లు, ఎ.వినయ్ కుమార్ , వినయ్, రమేష్, ఏసు పాల్గొన్నారు. 7

శింగరాయకొండలో మాట్లాడుతున్న డాక్టర్ హరిబాబు

మద్దిపాడులో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

టంగుటూరు మండలం పొందూరులో మాట్లాడుతున్నమోజెస్

కొప్పోలులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత

వేసవి శిక్షణా శిబిరంలో చెస్, క్యారమ్స్ ఆడుతున్న పిల్లలు

వేసవి శిబిరంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణా కార్యక్రమమైన 5వ రోజు విద్యార్థినీ విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించటం, కథలు చెప్పించటం నిర్వహించారు. అనంతరం పిల్లలతో చెస్, క్యారమ్స్, బాలికలకు స్కిప్పింగ్‌లను ఆడించారు. ఈ శిబిరంలో 10 మంది పిల్లలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో ఎరిక్షన్‌బాబు

అమానుగుడిపాడులో ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం అమానుగుడిపాడు గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు టిడిపి యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరాధన మహోత్సవంలో పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర కుమారుడు మన్నె రవిచంద్ర, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, వడ్లమూడి లింగయ్య, జాగర్లమూడి వెంకటేశ్వర్లు, కంచర్ల సత్యనారాయణ గౌడ్, ఒంగోలు ఆదిరెడ్డి, కె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రూ నాయక్‌ను సన్మానిస్తున్న సాహితీ వేదిక నిర్వాహకులు

కోలాటం మాస్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కోలాటం మాస్టర్ మంత్రూ నాయక్‌ను ఆదివారం తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో ఒంగోలులోని రంగారాయుడు చెరువు సమీపంలో గల అయ్యప్పస్వామి దేవాలయంలో ఘనంగా సన్మానించారు. నంది అవార్డుతో పాటు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం, రూ.పది వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రామావత్ మంత్రూనాయక్ మాట్లాడుతూ తనది పుల్లలచెరువు మండలంలోని నరజాముల తండా అని తెలిపారు. 12 ఏళ్ల క్రితం సరదా కోసం తెలంగాణలో శివాజీ గురువు దగ్గర కోలాటం నేర్చుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 300 టీములకు కోలాటం నేర్పినట్లు చెప్పారు. అందులో ఎక్కువగా మహిళా టీములకే నేర్పినట్లు తెలిపారు. గత నెల 30వ తేదీన ఒంగోలులో రాష్ట్రస్థాయిలో కోలాటం పోటీలను తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఆ పోటీలలో అత్యంత ప్రావీణ్యం కనబరిచినందుకు గాను తనను సన్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అప్పినపెల్లి భాస్కరాచారి, జాతీయ సమన్వయకర్త ప్రదీప్‌కుమార్, చైర్మన్ రాజ్ కుమార్, జాతీయ అధ్యక్షులు రంగశెట్టి రమేష్, జాతీయ కన్వీనర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జెండాను ఎగురవేసి సుందరయ్యకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డీకేఎం రఫీ మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తికై కడవరకు పోరాడిన కమ్యూనిస్టు గాంధీ సుందరయ్య అని అన్నారు. సుందరయ్య ఉద్యమమే ఊపిరిగా ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలకు, ఆర్భాటలకు దూరంగా ఉంటూ 6 దశాబ్దాలకుపైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. 17 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పిలుపునందుకొని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి జైలుకు వెళ్లాడన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఆయన కడవరకు కార్మిక వర్గ దృక్పథంతో వారి ప్రయోజనం కోసం, పీడిత ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తూ నమ్మిన సిద్ధాంతానికి కడవరకు కట్టుబడిన మహానేత సుందరయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు పి రూబెన్, కాశయ్య, విక్టర్, కిరణ్, శారా పాల్గొన్నారు.

సంతనూతలపాడు: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, త్యాగజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడులోని సుందరయ్య భవన్లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లో సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు షేక్ మాబు, మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు కోదాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని పేర్నమిట్ట, మైనంపాడు, మంగమూరు గ్రామాలలో సిపిఎం జెండాలను ఆవిష్కరించారు. పేర్నమిట్టలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీవీ రమణ, అన్ను వెంకట సుబ్బారావు, మైనంపాడులో కిలారి పెద్దబ్బాయి, అద్దంకి భగత్‌సింగ్, కరిచేటి హనుమంతరావు పాల్గొన్నారు. మంగమూరులో జరిగిన కార్యక్రమంలో షేక్ మస్తాన్, అబ్బూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పెద్దదోర్నాలలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పేదల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, దావీదు, పిచ్చయ్య, రాజాకృష్ణ, వెంకటేశ్వర్లు, మిరియాల వెంకటేశ్వర్లు, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత, పేద ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా గిద్దలూరు సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం గిద్దలూరు డివిజన్ నాయకులు టి ఆవులయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య.. రెడ్డి సామాజికవర్గంలో పుట్టినా అణగారిన వర్గాల, పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పేద ప్రజల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకుడని, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి థామస్, రాజశేఖర్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సంతనూతలపాడులో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షేక్ మాబు తదితరులు

సంతనూతలపాడులో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు కోదాటి కోటేశ్వరరావు

గిద్దలూరులో సుందరయ్యకు ఘన నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

దోర్నాలలో సుందరయ్యకు సిపిఎం కార్యకర్తల నివాళి

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మంగమూరులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ సెంటర్ స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వారు సంయుక్తంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో సుమారు 100 మంది గుండె సంబంధిత సమస్యలున్న వారికి ఉచితంగా ఈసీజీలు పరీక్షలు నిర్వహించారు. మరొక 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో అత్యవసరమనుకున్న కొద్దిమందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ శ్యామల వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు షేక్ మస్తాన్, మంచికలపాటి శ్రీనివాసరావు, జంగం కోటేశ్వరరావు, షేక్ నాగూర్‌బీ, అబ్బూరి బసవమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంప్ కాస్లులకు పంపించి వారి అభివృద్ధికి సహకరించాలని గ్రంథపాలకుడు కే సత్యనారాయణ కోరారు.

వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు, పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వర్షం కురిస్తే రహదారులు తటాకాలే..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో వర్షం కురిస్తే రహదారులన్నీ తటాకాలుగా మారుతున్నాయి. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో కురిసిన వర్షపు నీరు డ్రైనేజీ ద్వారా వెళ్లే అవకాశం లేక నీరంతా రోడ్లపైనే నిలుస్తోంది. కురిసిన వర్షానికి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నీరంతా నిలిచిపోయింది. డ్రైనేజీ కాలువలు పొంగి అందులోని వ్యర్థాలన్నీ రోడ్లపైకి వచ్చాయి. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దీనికి తోడు ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేస్తూ అదుపు తప్పి గుంతల్లో పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను కల్పించడంతో పాటు మురుగు కాలువల్లో ఉన్న చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు. అలాగే వర్షపు నీరు రోడ్లపై నిలపడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మార్టూరులో ర్యాలీ చేస్తున్న హెల్ప్ సంస్థ ప్రతినిధులు

హెచ్ఐవి బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పిద్దాం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ అవుట్ రిచ్ వర్కర్ కంద్రాతి దుర్గ అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఏపి ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక గన్నవరం రోడ్డులో ఇంటర్నేషనల్ క్యాండిల్ లైట్ మెమోరియల్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌తో మరణించిన ప్రతి ఒక్కరి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిఈలు ప్రమీల, రూత్ పాల్గొన్నారు.

అద్దంకిలో ర్యాలీ చేస్తున్న హెల్ప్ సంస్థ ప్రతినిధులు

అద్దంకి : హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపించకూడదని, వారిపట్ల ప్రేమ ఆప్యాయత కలిగి ఉండాలని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కలిగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసిటిసి కౌన్సిలర్ ఓబులరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ స్మారక ర్యాలీ స్థానిక రామానగర్ నుండి బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ఆదివారం నిర్వహించారు. ఎయిడ్స్ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ పోషకాహారం తీసుకుంటే ప్రాణాంతకం కాదని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా యువత విచక్షణ కోల్పోయి శృంగారం చేయడం వల్ల చాలా మంది ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్ఐవి, ఎయిడ్స్ బారిన పడుతున్నారని అన్నారు. సమాజానికి చాలా ప్రమాదకరమైన పరిస్థితులను స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రజల భాగస్వామ్యంతో చైతన్యం చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఓఆర్‌డబ్ల్యు ఔట్రీచ్ వర్కర్స్ కరుణ, శ్రావణి, పిఈ కె మల్లేశ్వరి, పార్వతి, శివపార్వతి పాల్గొన్నారు.

సముద్ర తీరంలో పర్యాటకుల సందడి

సూర్యలంకలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని సూర్యలంక బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఎండ వేడి ఉక్కపోతకు నుండి సేద తీరేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు సూర్యలంక సముద్ర తీరానికి విచ్చేశారు. ఆదివారం, వేసవి సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా పిల్ల పాపలతో రెండు తెలుగు రాష్ట్రాల నుండి పర్యాటకులు వచ్చారు. సముద్ర స్నానాలు ఆచరించే పర్యాటకులకు లోతుకు వెళ్లనివ్వకుండా పోలీసులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ భద్రతా చర్యలు చేపట్టారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఘర్షణలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. రూరల్ ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎన్నికల సమయంలో, ఎన్నికల అనంతరం నమోదైన కేసులను క్షుణ్ణంగా ఆదివారం పరిశీలించారు. కేసుల ప్రస్తుత స్థితిని స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకొన్నారు. తర్వాత తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుం దని అన్నారు. 2వ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను పరిశీలించడానికి వచ్చినట్లు తెలి పారు. ఈపాటికే కేసుల్లో ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కొందరికి 41(ఏ) సిఆర్‌పిసి కింద నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ముద్దాయిలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ముద్దాయిల చర్యలు పునరావృతం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరుసగా నేరాల్లో పాల్గొంటున్న వారిపై రౌడీషీట్ తెరుస్తా మని తెలిపారు. వారి ప్రవర్తన మార్చుకోకపోతే చట్ట పరంగా జిల్లా బహిష్కరణ చేయటానికి వెనకాడబోమని తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్ట బద్రత చర్య లు తీసుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని చెప్పా రు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించటానికి ప్రయ త్నించినా ఉపేక్షించబోమని అన్నారు. అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సీజ్ చేస్తామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నమోదైన ప్రతి కేసును సమీక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పి బి ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ వి మల్లికార్జున, సిఐలు సోమశేఖర్, శేషగిరిరావు, నిమ్మగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

టూటౌన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

నేడు విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

ఉమ్మడి మద్రాసు నుండి విడిపోయిన తర్వాత ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతిని సందర్భంగా స్థానిక వాసవి నగర్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో 10వ తరగతిలో 550, ఆపైన మార్కులు సాధించిన మండలంలోని 143 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నేడు బహుమతి ప్రదానం చేయనున్నట్లు అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్తు తెలిపారు. స్థానిక బంగ్లా రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ హాజరవుతారని తెలిపారు. వూటుకూరి కృష్ణ సుభాన్, రావూరి రంగయ్య సౌజన్యంతో 31మంది విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. సంకా సుబ్రహ్మణ్యం(బాబు) సౌజన్యంతో ప్రకాశం మిత్రమండలి ప్రచురించిన ఓ గ్రంథాన్ని కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఊటుకూరి నరేంద్ర భోజన ఏర్పాట్లు చేశారు. వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ యు దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డివిఎం సత్యనారాయణ, ఆర్‌వి రాఘవరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఇలపావులూరి శేషతల్పశాయి సభకు అధ్యక్షత వహిస్తారు. పాలపర్తి జ్యోతిప్మతి, షేక్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగే సభకు అందరూ హాజరు కావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - పంగులూరు

పూర్వ విద్యార్థుల్లో స్నేహభావం ఉండాలని, సమాజం పట్ల బాధ్యతాయుతంగా పనిచేయా లని స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల 1990 - 91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అప్పటి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానం చేశారు. పూర్వ విద్యార్థి పూల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమా వేశంలో అప్పటి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పి శేషయ్య మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు స్నేహ పూర్వక వాతావరణంలో పెరిగినప్పుడే సమాజం ముందడుగు వేస్తుందని అన్నారు. అలాంటి వాతావరణం తమ పాఠశాల్లో తాము చూశామని అన్నారు. అప్పటి గణిత ఉపాధ్యాయులు పుట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల ఒక గురుతరమైన బాధ్యతతో పనిచేయాలని అన్నారు. పూర్వ హిందీ ఉపా ధ్యాయిని సత్యవతి దేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో, ఉపాధ్యాయుల పట్ల భక్తి శ్రద్ధలతో చదవబట్టి ప్రయోజ కులుగా మారారని అన్నారు. అనంతరం 34ఏళ్ల క్రితం పాఠశాల్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన పి శేషయ్య, హెచ్ఎం పేరయ్య, పుట్ట వెంకటేశ్వర్లు, రత్తయ్య, పోతిన సుబ్బారావు, హనుమయ్య, సంభయ్య, రఘునాథ్, సత్యవతి దేవి, నారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు తలపనేని రామాంజ నేయులు, పూర్వ విద్యార్థులు మాగులూరి లలిత, మిడిదొడ్డి తిరుపతమ్మ, వివిఎస్ ప్రసాద్, తన్నీరు వెంకట్రావు, భీమవరపు శ్రీనివాసరావు, నూతలపాటి వెంకట సుబ్బారావు, తలపనేని శ్రీనివాసరావు మాట్లాడారు.

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో మద్యం పట్టివేత

ప్రజాశక్తి - చీరాల

తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్‌కు చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు తెస్తు న్న ఇద్దరి వ్యక్తులను చీరాల రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాంపై రైల్వే పోలీసు లు ఆదివారం పట్టుకున్నారు. గుంతకల్ రైల్వే ఎస్‌పి కె చౌడేశ్వరి ఆదేశాలు మేరకు నెల్లూరు రైల్వే డిఎస్‌పి సిహెచ్ విజయ భాస్కర్ సూచనలు ప్రకారం ఒంగోలు జిఆర్‌పి సిఐ ఆధ్వర్యంలో చీరాల జిఆర్పి ఎస్ఐ సిహెచ్ కొండయ్య, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. పట్టణంలోని మరియమ్మపేటకు చెందిన కొడాలి రాఘవ, కారం చేడుకు చెందిన కనికమళ్ళ చిన్నబాబు ఇరువురు తెలం గాణ నుండి అక్రమంగా చార్మి నార్ ఎక్స్‌ప్రెస్ రైలులో మ్యాన్షన్ హౌస్ బ్రాంది 99 క్వార్టర్ బాటిల్స్ తీసుకొస్తూ ప్లాట్ ఫారం 3 వద్ద అనుమా నస్పదంగా కనిపించారని ఎస్ఐ కొండయ్య తెలిపారు. దింతో తమ సిబ్బంది, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 90మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

పట్టుకున్న మద్యం చూపుతున్న ఎస్ఐ కొండయ్య

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చదువుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి వద్దు..

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులను చదువు పేరుతో ఒత్తిడికి గురి చేయకుండా వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్, స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'ఈ తరంలో మేము ప్రత్యేకం, స్టూడెంట్స్ సమ్మర్ వర్క్ షాప్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. మంచి సంకల్పం ఉంటే ఎంతటి క్లిష్టమైన పనులనైనా సాధించవచ్చని అన్నారు. కేజీ టు పీజీ కోర్సులను బాపట్లలో అందుబాటులోకి తెచ్చిన ముప్పలనేని శేషగిరిరావు కృషి అనన్య సామాన్యమని అన్నారు. ఆయన జీవితం నుండి నేటి తరం విద్యార్థులు స్ఫూర్తిని పొందాలని అన్నారు. ఈ తరంలో మేము ప్రత్యేకం అనే నినాదంతో ఆరోగ్యకరమైన భావి భారత సమాజ స్థాపనకై అహర్నిశలు కృషి చేస్తున్న స్టూడెంట్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు పిన్నిబోయిన శ్రీమన్నారాయణ కృషిని అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు రావూరి వీరరాఘవయ్య, రోటేరియన్ సుధీర్ బాబు, ప్రకృతి వైద్యులు డాక్టర్ కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెవివి వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - అద్దంకి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, గురకాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 6వ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు జెవివి కిడ్స్ సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు జెవివి గౌరవాధ్యక్షులు కావూరి రఘుచంద్ తెలిపారు. తరగతుల్లో డ్రాయింగ్, ఫన్ మ్యాథమెటిక్స్, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, ఫన్ గేమ్స్, సాంగ్స్ వంటి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుకు హాజరయ్యే విద్యార్థులు రూ.50 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు అభివృద్ధి చేయగలుగుతాయని అన్నారు. సామాజిక అంశాలతోపై సైన్స్ పట్ల ఆసక్తిని పెంచే అనేక అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. గణితం సులభంగా అర్థం చేసుకునేందుకు మెళుకువలు నేర్పిస్తారని తెలిపారు. వివరాలకు 9490598587, 9247176680 నంబర్లలో తంగా శ్రీనివాసరావు, బివి రత్నంను సంప్రదించాలని శిక్షణ తరగతుల వివరాలు కోరారు.

ఎపిఇఎపి సెట్ పరీక్షలకు 244 మంది హాజరు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏపి ఇఎపిసెట్ పరీక్షలకు ఆదివారం 244 మంది హాజరైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పరీక్షలు తమ కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ నందు ఈనెల 16నుండి 23వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. 250మందికి 244 మంది ఆదివారం హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల ఘటనలపై

వేగంగా స్పందించిన పోలీస్ శాఖ

ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలింగ్ రోజున ఆ తర్వాత చోటు చేసుకున్న ఘటనలపై జిల్లా పోలీస్ శాఖ వేగంగా స్పందించి.. శాంతిభద్రతలను పరిరక్షించడం జరిగిందని ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. జిల్లాలో పలు చోట్ల ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, శాంతి భద్రతలు పరిరక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తుందని ఎస్పీ తెలిపారు. చీరాలలో కూటమి అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య ప్రయాణిస్తున్న వాహనంపై చీరాల మండలం, గవినివారిపాలెంలో జరిగిన దాడి ఘటనపై చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో సలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి.. కారకులైన ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. గవినివారిపాలెం పంచాయతీ పరిధిలో జరిగిన మరొక ఘటనపై నక్క వెంకటేశ్వర్లు ఇచ్చిన పిర్యాదు మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదుచేసి ఐదుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. చీరాల పట్టణం, వేటపాలెం మండలంలో వైసిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలపై, చీరాల 6వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కష్ణమోహన్ వైసిపి కార్యకర్తపై చేయి చేసుకున్న ఘటనపై, వైసిపి కార్యకర్తలు ఆమంచి కష్ణమోహన్ ప్రయాణించే వాహనంపై రాళ్ళ దాడికి పాల్పడిన ఘటనలపై చీరాల 2టౌన్ పోలీస్ స్టేషన్ లో మొత్తం ఐదు కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో ఇప్పటి వరకు 61 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్‌లు చేసినప్పటికీ కొన్ని పత్రికలు పూర్తి వివరాలను తెలుసుకోకుండా ప్రజలను అభద్రతా భావనలకు గురిచేసే విధంగా, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగే విధంగా కథనాలు ప్రచురించడం సరికాదన్నారు.

సుందరయ్య ఆశయ సాధన కోసం కృషి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం కషి చేద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో భోగిరెడ్డి వీరారెడ్డి స్థూపం వద్ద సిపిఎం ఉప్పరపాలెం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటంతో పాటు ఈ ప్రాంత ఉద్యమ నేత చీవుకుల శేష శాస్త్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రమాదేవి మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి యువతకు మార్గదర్శకమన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సుందరయ్య ముందు నిలిచి పోరాడారని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించి పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం, కార్మికులు, రైతు, కూలీల సమస్యల పరిష్కారం కోసం సుందరయ్య కడదాకా కషి చేశారని అన్నారు. సుందరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని మరింత పట్టుదలగా కషి చేయడమే సుందరయ్యకు అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, సిపిఎం ఉప్పరపాలెం శాఖ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, నాయకులు రాజు వెంకారెడ్డి, ఏ. రంగారెడ్డి, సుబ్బారెడ్డి, కె.నాగేశ్వరావు, వై.భాస్కరరావు, సుభాషిని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమాదేవి

చీరాల: సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్.జే రంగనాయకులు బాపనమ్మ కళ్యాణమండపంలో సభ నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి సి హెచ్.గంగయ్య మాట్లాడారు. ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వసంతరావు, కొండయ్య, దళిత మహాసభ నాయకులు ఎన్ బాబురావు పాల్గొన్నారు.

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీ ప్రతిభ' విజయభేరి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

ఆదివారం విడుదలైన జెఇఇ మెయిన్స్-2024 పరీక్షా ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యార్థులు ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారు. వెన్నా జయచంద్రారెడ్డి 14వ ర్యాంక్, ఘట్టమనేని మోహిత సాయి 37వ ర్యాంక్, కండ్లగుంట పూజ 56వ ర్యాంక్, తోట వెంకట అవినాష్ నాయుడు 70వ ర్యాంక్, పుట్లూరి గోవర్ధన్ 71వ ర్యాంక్, దారం శ్రీవర్ధన్ రెడ్డి 81 ర్యాంక్ ఉండేలా శివనాగేంద్రారెడ్డి 82వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఒ నల్లూరి జయప్రకాశ్ నారాయణ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల అనంతరం జిల్లాలో జరుగుతున్న పరిణామాలు, స్ట్రాంగ్ రూముల భద్రత, కౌంటింగ్ రోజు తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు గురించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాలోని డిఎస్పీలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ నుండి 100 మీటర్ల బయట బారికేడింగ్ చేయాలని, ఎటువంటి వాహనాన్ని లోపలికి అనుమతించకూడదన్నారు. ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులను, కౌంటింగ్ ఏజెంట్‌లను, కౌంటింగ్ సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలని, నియోజకవర్గాల ఆర్వోలు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని చెప్పారు. కౌంటింగ్ రోజు విధి విధానాల గురించి వివరించాలని, స్ట్రాంగ్ రూములను అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఓపెన్ చెయ్యాలని, కౌంటింగ్ సిబ్బందికి ముందస్తుగా బ్రీఫింగ్ చేయాలని ప్రతి నియోజకవర్గ కౌంటింగ్ లో సంబంధిత ఆర్.ఓనే ఇన్చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

- మెరుగైన వైద్య సేవలే ధ్యేయం
- పకడ్బందీగా ఫ్యామిలీ డాక్టర్ అమలు
- 6 ప్రైవేట్ హాస్పిటల్స్‌కు నోటీసులు
- ముఖాముఖిలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డిఎం,హెచ్ఒ ప్రజాశక్తికి వివరించారు. ఆ వివరాలన్ని ఆయన మాటల్లోనే..

ప్రకాశం జిల్లాలో ఒంగోలులో ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు మాతాశిశు వైద్యశాల, మార్కాపురంలో జిల్లా వైద్యశాల, యర్రగొండపాలెం, గిద్దలూరులో రెండు ఏరియా వైద్యశాలలు, 9 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 64 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 538 వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నాం. జిల్లాలో 108 వాహనాలు 40 ఉండగా వాటి ద్వారా అత్యవసర సర్వీసులను అందించి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాం. వీటితో పాటు 48 సంచార వాహనాలు(104) ద్వారా నెలవారీ గ్రామ సందర్శన ప్రణాళిక రూపొందించి గ్రామాలలో ప్రజలకు వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నాం.

పకడ్బందీగా ఫ్యామిలీ డాక్టర్ అమలు

సొంత ఊరిలోనే ప్రతి ఒక్కరికీ ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలుచేస్తున్నాం. 2023 ఏప్రిల్ 6న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 64 పిహెచ్‌సిల పరిధిలో ఇద్దరు వైద్యాధికారులను నియమించాం. ఓ వైద్యాధికారి ఫ్యామిలీ డాక్టర్‌కు హాజరవుతుండగా, మరొకరు వైద్యశాలలో ఓపిలో పాల్గొంటున్నారు. ప్రతి రోజు జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల ల్యాబ్ పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 91 పాజిటివ్ కేసులు దర్శి ప్రాంతంలో నమోదయ్యాయి. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎపిడిమాలజిస్ట్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బృందాలు పరిశీలన చేపట్టాయి. అబేట్ సొల్యూషన్ నీళ్ళలో కలిపి పశువులకు తాగించటం, పంచాయతీ పరిధిలో ఫాగింగ్ చేయించటం, కేసులు నమోదైన దర్శి ప్రాంతం, పశ్చిమ ప్రకాశంలో ఇండోర్ స్ప్రేయింగ్ చేపట్టాం. నల్లమల ఏరియాలో దోమలు కుట్టకుండా ఇన్‌సెక్టిసైడల్ దోమలు తెరలు అందిస్తున్నాం. ఆర్‌డబ్ల్యుఎస్, డిపిఒ, పశు సంవర్ధక శాఖ సహకారంతో నివారణ చర్యలు చేపట్టాం. డెంగీ నిర్ధారణకు ప్రైవేట్ ఆసుపత్రులలో స్ట్రిప్ మెథడ్ పరీక్షలు సరికాదు. ఎలీసా టెస్ట్ ప్రామాణికం. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మార్కాపురం జిల్లా ఆసుపత్రులలో ఈ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. చీమకుర్తి ప్రాంతంలోని గుంతలలో మత్స్య శాఖ సహకారంతో గంబూషియా చేపలు వదులుతున్నాం.

అర్బన్ పిహెచ్‌సిల్లో నాణ్యమైన సేవలు

జిల్లా 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యులు, ఏఎస్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్స్, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉన్నారు. నగర, పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

ముఖాముఖి

6 ప్రైవేట్ హాస్పిటల్స్‌కు నోటీసులు

80 శాతం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న 6 ప్రైవేట్ ఆసుపత్రులకు నోటీసులిచ్చాం. ఒంగోలులో 2, మార్కాపురంలో 1, గిద్దలూరులో 2 హాస్పిటల్స్ ఉండగా వారం రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో సంస్థాగత కాన్పులు జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు జరిగితే రోగులను సురక్షితంగా ఎలా తరలిస్తారనే విషయమై పరిశీలన చేపట్టాం. ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఉందో, లేదో పరిశీలన చేశాం. ఆసుపత్రుల రెన్యువల్, ఎన్‌ఒసి వంటి సర్టిఫికెట్లు పరిశీలించాం. దాదాపు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఉన్నాయి.

సికెల్ సెల్ ఎనీమియాకు చికిత్సలు

సికెల్ సెల్ ఎనీమియా వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి. 11 పిహెచ్‌సిల పరిధిలో వ్యాదిపై పరిశీలన జరుగుతోంది. జిల్లాలో 14,918 మందికి పరీక్షలు జరపగా.. 14,777 మందికి నెగిటివ్ రిపోర్ట్స్ రాగా, 129 మంది డిసీజ్ క్యారియర్స్‌గా ఉన్నారు. 17 మంది సికెల్ సెల్ ఎనీమియాతో బాధపడుతుండగా వీరిని గుంటూరు, విజయవాడ, మంగళగిరి తరలించి వైద్యసేవలు అందిస్తున్నాం. రానున్న కాలంలో అందరి సహకారంతో వైద్య, ఆరోగ్య శాఖను మరింత అభివృద్ధి చేస్తా..